గ్రామాల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర - కోటవురట్ల : గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి అన్నారు. శనివారం కైలాసపట్నం గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సచివాలయం, ఆరోగ్య ఉప కేంద్రం వద్ద మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి పరిసరాల పరిశుభ్రత మొక్కల పెంపకం వలన కలిగే ప్రయోజనాలు పైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. మండలంలో వివిధ గ్రామాల్లో స్వచ్ఛ్ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి పరిసరాల పరిశుభ్రతను చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెన్నాడ నూకరత్నం, గ్రామ తెదేపా అధ్యక్షులు భీముని మాణిక్యాలరావు, ఆరోగ్య ఉపకేంద్రం స్టాఫ నర్స్ తులసి, రైతు సేవా కేంద్రం సిబ్బంది గీత, మహిళా పోలీస్ లలిత, ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్ జ్యోతి, అంగన్వాడి కార్యకర్తలు లక్ష్మి, భవాని, ఆశా కార్యకర్తలు గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు.

చోడవరం పాత చెరువులో దురాక్రమణలు తక్షణమే అడ్డుకోవాలి

భారత కమ్యూనిస్టు పార్టీ డిమాండ్

విశాలాంధ్ర - చోడవరం : చోడవరం నడిబొడ్డులో రెవెన్యూ సర్వేనెంబర్ 83 లో ఎ.39 -73 సెం.లు. విస్తీర్ణం కలిగిన పాత చెరువులో బడా బాబుల దురాక్రమణలను తక్షణమే అడ్డుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై కార్మిక కర్షక నేత రెడ్డిపల్లి శనివారం మీడియాతో మాట్లాడుతూ చెరువు ప్రాంతంలో ఆర్టీసీ కాంప్లెక్స్ దరి, కొంత స్థలము లీజుకని తీసుకున్న లీజుదారులు , పాత చెరువును అక్రమంగా గలీజు చేస్తూ కప్పేస్తుంటే స్థానికంగా ఉన్న అధికారులు ఏమీ తెలియ నట్టుగా నటిస్తూన్నారని తెలిపారు. ఆక్రమణ దారులు అడ్డు అదుపు లేకుండా దౌర్జన్యంగా చెరువులు కప్పేస్తుంటే స్థానికంగా ఉన్న ఎమ్మెల్యే కనీసం పట్టించుకునే పరిస్థితి లేదని, ఇప్పటికే చాల వరకు చెరువులు అన్యాక్రాంతమై పోతూ, పర్యా వరణం పూర్తిగా కాలుష్యంతో నిండి పోతుంది అని అన్నారు. దురాక్రమణలు, కబా జలతో సాగునీటి చెరువులు మాయమై పోతుండడంతో వ్యవసాయానికి నీరు లేక వ్యవసాయ పరిస్థితి అధ్వానంగా తయార య్యిందన్నారు. వ్యవసాయానికి నీరు అందక, రైతుల ఇబ్బంది పడతుంటే, యదేచ్ఛగా చెరువులను ఆక్రమిస్తున్నారని తెలిపారు. పాత చెరువుమీద ఆధారపడి మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారని, వర్షాకాలం, తుఫాను సమయాల్లో దిగువ నిర్వాసిత ప్రాంతాలైన రెల్లి వీధి, ప్రేమ సమాజం, బాలాజీ నగర్, గునిశెట్టి వారి వీధి, దుడ్డివీధి, ద్వారకా నగర్ తదితర పల్లపు ప్రాంతాలు ప్రధాన రహదారులు పూర్తిగా నీట మునిగిపోయే పరిస్థితుల్లో, పాత చెరువుని కప్పి వేయడం వలన పూర్తిగా దిగువప్రాంతాలు నీటి మునిగి పోయే పరిస్థితి దాపురిస్తుందని తెలియ జేశారు. ఇదే విషయాన్ని పలు సందరాల్లో ప్రభుత్వ అధికారులకు తెలియజేసినను, చర్యలు చేపట్టడంలో వైఫల్యం చెందుతున్నారని, అక్రమా ర్కులకు వెన్ను దన్నుగా ఉంటూ పాత చెరువును కప్పివేస్తున్నారని తెలిపారు. 2024 లో ఏ.పి. హైకోర్టులో డబ్ల్యూ.పి.నెం. 9883/2024 ఆర్డర్ తో చెరువులను కప్పద్దని ఆదేశించినను, ఆక్రమణదారులు, ప్రభుత్వ అధికారులు హైకోర్టు ఆదేశాలను తోసిబుచ్చి, దౌర్జన్యంగా పాత చెరువు ను కప్పివేస్తా ఉన్నారని తెలిపారు. పాత చెరువు దురాక్రమణలపై రెవెన్యూ పోలీస్ అధికారులు తక్షణమే తగిన చర్యలు చేపట్టకపోతే, కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేసి, రిలే దీక్షలు చేపడతామని, ఉన్నత న్యాయ స్థానాలను ఆశ్రయించి, పరిస్థితిలు చక్కబడే వరకు పోరాడుతామని తెలియజేశారు. దీనికి స్థానిక టిడిపి, కూటమి నాయకులు, ప్రభుత్వ అధికారులదే ప్రధాన బాధ్యత అని తెలియజేశారు.

స్వచ్ఛాంధ్ర సాధనను సహకరించాలి

విశాలాంధ్ర - మాకవరపాలెం : స్వచ్ఛాంధ్ర సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రం మాకవరపాలెంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి ర్యాలీ, మానవహారం చేశారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞను చేశారు. పర్యావరణ రంగంలో విద్యా, ఉద్యోగ అవకాశాలు అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి పీఎస్ఎన్ మూర్తి, ఎలక్ట్రికల్ ఇంజనీర్ బాలకృష్ణ, పంచాయతీరాజ్ ఇంజనీర్ సోమశేఖర్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, సచివాలయం సిబ్బంది పూర్ణిమ, రేవతి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా 'శ్రీనివాస కళ్యాణ మహోత్సవం'

విశాలాంధ్ర - మునగపాక : మండలంలో వాడ్రాపల్లి గ్రామంలో శ్రీనివాస కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో స్వామివారి కళ్యాణం నిర్వహించారు.కళ్యాణ మహోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాండ్రేగుల శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కళ్యాణ మహోత్సంలో వైసీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, అనకాపల్లి జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మళ్ల వరహా నర్సింగరావు, జనసేన మండల పార్టీ అధ్యక్షులు టెక్కలి పరశు రామ్,గ్రామ సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, మాజీ పాల సంఘం అధ్యక్షులు పెతకంశెట్టి రామ జోగినాయుడు, కాండ్రేగుల రాము, సూరిశెట్టి శివ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాలు బహుకరణ

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట : మండలంలోని తురకలపూడి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న గణేష్ కాలనీలో తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ సహాయ సహకారాలతో నిర్మించిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి ఉత్సవ విగ్రహాలను గ్రామానికి చెందిన కంచర్ల సోమన్న శెట్టి అనే భక్తుడు సుమారు 40 వేల రూపాయల విలువ గల ఉత్సవ విగ్రహాలను ఆలయానికి బహూకరించారు. ఈ సందర్భంగా సోమన్న శెట్టి మాట్లాడుతూ స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన ధనుర్మాసంలో తమ గ్రామంలో నిత్యం మేలుకొలుపు కార్యక్రమం నిర్వహించడం వలన ప్రజలలో భక్తిని పెంపొందిస్తుందన్నారు. అనం తరం ఆలయంలో స్వామి వారికి గ్రామ పెద్దలు, భక్తుల సమక్షంలో పంచామృతాభిషేకంతో విశేష పూజలు నిర్వహించారు.



బుచ్చయ్యపేట : భారత రత్న మాజీ ప్రధాని స్వర్గీయ అటల్ బిహారీ వాజ్ పేయి విగ్రహ విష్కరణ కార్యక్రమం అనకాపల్లి డైట్ కాలేజ్ జంక్షన్ జాతీయ రహదారి కూడలి ప్రాంతంలో శనివారం ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి బుచ్చయ్య పేట మండలంలో ఉన్న అనేక గ్రామాల నుండి విశాఖ డైరీ డైరెక్టర్ గేదల సత్యనారాయణ ఆధ్వర్యంలో కూటమి నాయకులు భారీగా తరలి వెళ్లారు.

చోడవరం మండల మహిళా సమాఖ్య ఏర్పాటు

- అధ్యక్ష కార్యదర్శులుగా గోవాడ కనకమాలక్ష్మి, సత్యవతి

విశాలాంధ్ర - చోడవరం : చోడవరం మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని బానయ్య కోనేరు వద్ద శనివారం జరిగిన సమావేశంలో ఏర్పాటు చేశారు. సిపిఐ మండల కార్యదర్శి సోమాదుల దేవి అధ్యక్షతన జరిపిన సమావేశానికి జిల్లా సహాయ కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి బూసి పరమేశ్వరి పాల్గొని మాట్లాడుతూ చోడవరంలో మహిళ పట్ల చిన్నచూపు చూస్తున్నారని, బాలికల వసతి గృహాల వద్ద సరైన వద్ధతిలో విద్యార్థులకు భోజనం, వసతి సదుపాయాల్లో వార్డెన్లు అలసత్వం వహిస్తున్నారని అన్నారు. మహిళలు అందరూ ఒక తాటిపై కొచ్చి మహిళలు పై జరుగుతున్న గృహహింస, అమానుష్యమైన సంఘటనల ను వ్యతిరేకించవలసిన అవసరం ఉందని తెలిపారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ ఇటీవల కాలంలో మహిళలు పట్ల దాడులు పెరిగిపోతున్నాయని, మహిళలకు ఉచిత బస్సు పథకం పెట్టి, వారికి సరైన రవాణా సదుపాయం ఏర్పాటు చేయలేదన్నారు. బస్సులను తగ్గించి పేరుకి మాత్రమే ఉచితం, బస్సుల్లో మహిళలు కూర్చోవడానికి కనీసం సీట్లు లేని పరిస్థితి ఏర్పడుతుందని, మహిళల గౌరవాన్ని కించపరిచే విధంగా ... ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాన్ని ఖండించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీని ఏర్పాటు చేసి, తొమ్మిది మందితో మహిళ సంఘం కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్ష కార్యదర్శులు గోవాడ కనక మహాలక్ష్మీ, ఓమి సత్యవతి ల తోపాటు 7గురు కమిటీ సభ్యులు, కాకరకాంతం, బొబ్బిలి దేవి, వరలక్ష్మి, బండి సన్యాసమ్మ అంగడ నూకరత్నం, ఎం.వరలక్ష్మి, మరియు మహిళలు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు నాయుడు బహిరంగ సభకు తరలివెళ్లిన కూటమి నేతలు, కార్యకర్తలు

విశాలాంధ్ర - సబ్బవరం : అనకాపల్లి జిల్లా తాళ్ల పాలెం లో శనివారం జరిగిన సీఎం నారా చంద్రబాబు నాయుడు బహిరంగ సభకు మండలంలోని కూటమి శ్రేణులు భారీగా తరలి వెళ్లారు.పైడివాడ అగ్రహారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ అక్కిరెడ్డి రామలక్ష్మి దుర్గి నాయుడు ఆధ్వర్యంలో దేశం కార్యకర్తలు, నేతలు భారీగా తరలి వెళ్లారు. అలాగే బీజేపీ సీనియర్ నాయకులు చొక్కాకుల వెంకటరావు ఆధ్వర్యంలో సబ్బవరం మండలం నుంచి బిజెపి శ్రేణులు భారీగా చంద్రబాబు నాయుడు బహిరంగ సభకు తరలి వెళ్లారు. అలాగే బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన సర్పంచ్ దాడి లావణ్య కన్నంనాయుడు ఆధ్వర్యంలో సీఎం బహిరంగ సభకు దేశం కార్యకర్తలు, నేతలు తరలి వెళ్లారు. అలాగే జనసేన వీర మహిళ బంతి కోళ్ల పద్మ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బహిరంగ సభకు భారీగా జనసైనికులు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో అక్కిరెడ్డి దుర్గి నాయుడు, గొంతిన పైడిరాజు,కోన సత్యనారాయణ, అంతకాపల్లి ఎంపీటీసీ చొక్కాకుల గోవింద, రొంగలి బుచ్చంనాయుడు, రాజాన నాయుడు, టి.శేఖర్, కొల్లి కృష్ణ, జి.మన్మధరావు, ఎస్ కొండబాబు, మేడపాటి రాము, తమరాన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లాయర్ అజయ్ కుమార్ పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి

విశాలాంధ్ర - రావికమతం : జిల్లాలో ఆదివాసీల సాగు భూములపై న్యాయస్థానంలో ఆదివాసీల తరుపున లాయర్ గా అనేక కేసులు వాదిస్తున్నా లాయర్ అజేయ్ కుమార్ పెట్టిన అక్రమ కేసులు తొలగించి తక్షణమే విడుదల చేయాలని కోరుతూ రావికమతం మండల కేంద్రంలో శనివారం పలు గిరిజన ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు జనార్ధన్, బంగారు రాజు, నల్లి కళ్యాణ్, అప్పారావు తదితరులు మాట్లాడుతూ ఇటీవల రోలుగుంట మండలం చటర్జీపురంలో జరిగిన భూ వివాదంలో జరిగిన సంఘటనపై లాయర్ పి యస్ అజయ్ కుమార్ని కూడా ముద్దాయిని చేస్తూ పోలీసులు అక్రమంగా కేసులు పెట్టి అరెస్ట్ చేసి రిమాండ్‌కి పంపించారని. ఈ భూ వివాదం కోర్టు లో కేసు నడుస్తుంద న్నారు, అయితే అక్టోబర్ 20న జెడ్‌పిటిసి వారా నూకరాజు రౌడీలతో భూమిలో చొరబడిన నేపథ్యంలో ఘర్షణ చోటు చేసుకుందని వారు వివరించారని ఘర్షణలో నూకరాజు మరణించడం బాధాకరం మని ఈ విషయమై 8 మంది ఆదివాసీలను కేసులు పెట్టి అరెస్ట్ చేసారని. అయితే ఇదే విషయమై లాయర్ పియస్ అజయ్ కుమార్ ని కూడా అరెస్ట్ చేసారని ఆరోపించారు. ఆదివాసీలకు అండగా ఓ న్యాయవాది కేసు వాదిస్తున్నందుకు లాయర్ అజయ్ కుమార్‌ను అరెస్ట్ చెయ్యడాన్ని ఖండిస్తున్నట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్ స్పందించి అజేయ్ కుమార్ పెట్టిన కేసులను తొలగించి న్యాయం చేయాలని డిమాండ్ చేసారు అనంతరం తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎపి ఆదివాసీ సంఘం జిల్లా కన్వీనర్ మోసురు రాజు, 5 వ షెడ్యూల్ సాధన సమితి జిల్లా అధ్యక్షులు కోత్తెం అప్పారావు, రవి, దేవి, లక్షణ్, పైడిరాజు, బాలరాజు తదితరులు పాల్గోన్నారు.

మానవుని దైనందిన జీవితంలో గణితం ఒక భాగం

విశాలాంధ్ర - పాయకరావుపేట : మానవుని దైనందిన జీవితంలో గణితం ఒక భాగమని ప్రముఖ గణిత శాస్త్ర ప్రొఫెసర్, అంతర్జాతీయ గణిత విద్య పరిశోధన సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ ఎస్.ఆర్.సంతానం అన్నారు. జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల నందు ఇన్ఫినిటమ్ పేరిట నిర్వహించిన సెమినార్‌కి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో గణితం యొక్క పరిధిని వివరించారు. ఆధునిక విజ్ఞానం, సాంకేతిక అభివృద్ధి అన్నీ గణిత పునాదులపైనే నిలబడి ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు గణితాన్ని కేవలం ఒక విషయంగా కాకుండా జీవన నైపుణ్యంగా అభ్యసించాలని సూచించారు. విద్యార్థులు శ్రీనివాస రామానుజాన్ని ఆదర్శంగా తీసుకొని, ఆయన అడుగుజాడల్లో నడుస్తూ విజ్ఞాన మార్గంలో ముందుకు సాగి దేశసేవ చేయాలని పిలుపు నిచ్చారు. గీతం యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. అరుణ కుమారి మాట్లాడుతూ మనకున్న అపూర్వ మేధావులలో ఒక్కరైన శ్రీనివాస రామానుజన్ 15 ఏళ్లకే భారతదేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగురవేసిన మహా గణిత శాస్త్రవేత అని తెలిపారు. నక్కపల్లి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శివయ్య మాట్లాడుతూ విద్యార్థులు గణితంలో పరిశోధన చేస్తే ఉన్నత స్థానాలకు చేరుకొనే అవకాశం ఉందని తెలిపారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో పెరుగుతున్న గణిత శాస్త్ర పాత్రను వివరించారు. ఈ వేడుకలలో భాగంగా విద్యార్థుల్లో గణితంపై ఆసక్తి, సృజనాత్మక ఆలోచనాశక్తి, విశ్లేషణాత్మక దృక్పథాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో క్రాస్‌వర్డ్, క్విజ్, పదశోధన వంటి పలు విజ్ఞానాత్మక పోటీలను నిర్వహించారు. క్విజ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతులు, జ్ఞాపికలు అందచేశారు. ఈ కార్యక్రమంలో స్పేసెస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రామకృష్ణా రెడ్డి, ప్రోగ్రాం కో - ఆర్డినేటర్ పెనుగొండ సుబ్బారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బూరుగుపాలెంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం

విశాలాంధ్ర - మాకవరపాలెం : మండలంలోని బూరుగుపాలెంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఉపాధి హామీ పథకం కింద వైద్యాధికారులు చరిష్మా, చరణ్ మొక్కలు నాటారు. పర్యావరణ పరి రక్షణలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను సైతం పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలుగు దేశం పార్టీ మండల ఉపాధ్యక్షులు కేతిరెడ్డి చిరంజీవి పేర్కొన్నారు. మరుగుదొడ్డి వాడకం పెరగాలని, రహదారులను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు బి.సత్తిబాబు, శ్రామికులు పాల్గొన్నారు.

అనంత పద్మనాభ స్వామి ఆలయంలో పూజలు

విశాలాంధ్ర - పాయకరావుపేట : మండలంలోని పిఎల్ పురం సమీపంలో ఉన్న అనంత పద్మ నాభ స్వామి ఆల యాన్ని గో ఉపాసకులు సురభి దాస్ అనే కుందుర్తి మహికిరణ్ శర్మ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పిల్లి నాగేంద్ర (తాసు), చింతకాయల రాంబాబు, మేడిశెట్టి దివాణం, వీరబాబు, అప్పారావు, ఓంకార్, మణికంఠ, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో మెడికల్ క్యాంప్

విశాలాంధ్ర - మాకవరపాలెం : జనవిజ్ఞాన వేదిక, ప్రజారోగ్య వేదిక సంయుక్త సౌజన్యంతో మాకవరపాలెం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో శనివారం మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాలికల ఆరోగ్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజారోగ్య వేదిక నాయకులు కామేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రత, ఆరోగ్య నియమాలు పాటించాలన్నారు. చిరుతిళ్లు, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత శుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తే అంటు రోగాలకు దూరంగా ఉండొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు హరిషిత్, రాజు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, పాఠశాల ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్త, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ధ్యాన దినోత్సవం

విశాలాంధ్ర - నక్కపల్లి : మండలంలో నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రపంచ ధ్యాన దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు ధ్యానంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శివయ్య ఆధ్వర్యంలో వేంపాడు ఆయుష్ యోగా ఇన్ స్ట్రక్టర్ డి. రాంబాబు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఎలమంచిలి యోగా గురు ఎ.గంగాధర్ డిగ్రీ విద్యార్థులకు ప్రాణాయామం, భస్త్రిక, కపాల భాతి, ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శివయ్య మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే యోగా ధ్యానం నేర్చుకోవడం వల్ల భవిష్యత్తులో ఎటువంటి అనారోగ్యాలు దరి చేరవని అన్నారు. ధ్యానం వల్ల పిల్లలకు మానసిక ప్రశాంతత కలిగి జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. యోగా శిక్షకులు రాంబాబు, గంగాధర్ మాట్లాడుతూ కోపాన్ని నియంత్రించేందుకు ధ్యానం ఉపకరిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వేంపాడు ఆయుష్ డాక్టర్ కె.రఘు, ఫార్మసిస్ట్ రామకృష్ణ, డిగ్రీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

దేవాలయాలకు రూ.1.2 లక్షలు

రూపాయలను మంజూరు చేయించిన ఎమ్మెల్యే సుందరపు

విశాలాంధ్ర - యలమంచిలి రూరల్ : అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గం రాంబిల్లి మండలం వెల్చూరు గ్రామంలో రూ. 66 లక్షలు శివాలయ నిర్మాణానికి, కట్టబోలు గ్రామంలో రూ. 36 లక్షలు రామాలయ నిర్మాణానికి దేవాదాయ ధర్మాదాయ శాఖా ద్వారా మంజూరు చేయడానికి కృషి చేసినందుకు గురువారం అచ్యుతాపురం ఎస్‌టిబిఎల్‌లో ఎమ్మెల్యే నివాసంలో నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ని కలిసి కృతజ్ఞతలు తెలిపిన ఇరు గ్రామాల నాయకులు, ప్రజలు.జనసేన పార్టీ అధ్యక్షులు,రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సనాతన ధర్మాన్ని నిలబెట్టేందుకు రాష్ట్రంలో ఆయన పడుతున్న కృషిని ఆదర్శంగా తీసుకుని, ఎమ్మెల్యే నియోజకవర్గం, రాంబిల్లి మండలం వెల్చూరు గ్రామంలో శివాలయం, కట్టబోలు గ్రామంలో రామాలయం నిర్మాణాలు అత్యవసరమని తెలుసుకుని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కి, దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డికి ఆలయాల నిర్మాణాల ఆవశ్యకతలను తెలియజేసి అతి తక్కువ సమయంలో నిధులు మంజూరు చేయించుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్చూరు, కట్టబోలు గ్రామస్తులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ తరగతులు పరిశీలన

విశాలాంధ్ర - నక్కపల్లి : సమగ్రశిక్షా విద్యాశాఖ సంయుక్త ఆదేశాలమేరకు శనివారం స్థానిక బాలుర ఉన్నతపాఠశాల నందు స్కూల్ అసిస్టెంట్ కాంప్లెక్స్ తరగతులను హెచ్.ఎమ్ పి.విజయ ఆధ్వర్యంలో ,ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు చినదొడ్డిగల్లు హైస్కూల్‌లో హెచ్ ఎమ్ బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ తరగతులలో పదవతరగతి వందరోజుల యాక్షన్ ప్లాన్, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ,వారి ప్రగతి గురించి చర్చించారు .స్థానిక బాలుర పాఠశాలలో తరగతులను ఎంఈవో1 కే నరేష్, ఎంఈవో 2 ఆర్ నాగన్నదొర పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలనందించారు.ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ ప్రతీ ఉపాధ్యాయుడూ వెనుకబడిన విద్యార్థులకు మెరుగైన సాధన కొరకు ఎలాంటి కృత్యాలు అమలుచేయాలో చర్చించాలన్నారు. వందశాతం ఫలితాలు సాధించాలని ప్రతీ విద్యార్థి తప్పనిసరిగా ఉత్తీర్ణులయ్యేలా శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రతీరోజూ స్లిప్ టెస్ట్ నిర్వహించి విశ్లేషణ చేయాలన్నారు. బోధన ఆకర్షణీయంగా ఉండాలన్నారు. ఈ తరగతులను వేమగిరి నూకరాజు, శ్రీలక్ష్మీ, వరలక్ష్మి, బషీర్ ఖాన్, చినతల్లి, జయశ్రీలతో పాటు రిసోర్స్ పర్సన్‌లుగా ఎన్.వివిఎస్ ఆచార్యులు, ప్రభావతి, టీ.వీ.రమణ, వై.వీ.రమణ ఏసుదేవుడు వ్యవహరించారు.

వాజ్ పేయ్ విగ్ర ఆవిష్కరణకు తరిలి వెళ్లిన బీజేపీ శ్రేణులు

విశాలాంధ్ర - చీడికాడ : అనకాపల్లిలో జరిగిన మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయ్ విగ్ర ఆవిష్కరణ కార్యక్రమానికి మండలంలోని వివద గ్రామాలనుండి నుండి అధిక సంఖ్యలో బిజెపి శ్రేణులు తరలి వెళ్లారు బిజెపి సీనియర్ నాయకులు ప్రముఖ న్యాయవాది ఎర్రా వెంకటరావు ఆధ్వర్యంలో మండలం నుండి అధిక సంఖ్యలో వివిధ వాహనాల్లో బిజెపి నాయకులు కార్యకర్తలు తరలి వెళ్లారు వాహనాల ర్యాలీకి బిజెపి సీనియర్ నాయకులు న్యాయవాది ఎర్రా వెంకటరావు జెండా ఊపి ప్రారంభించారు ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్ష కార్యదర్శులు పాతాళం బాలకృష? పల్లె అప్పల నాయుడు బిజెపి జిల్లా కార్యదర్శి పుట్టా మల్లికార్జునరావు కొల్లి సూర్యప్రకాశరావు జిల్లా బిజెపి కౌన్సిల్ మెంబర్ రెడ్డి కొండబాబు మాజీ సర్పంచ్ టిడిపి నాయకులు ఎర్ర అప్పారావు బిజెపి నాయకులు పరువాడ మురళి సింగపల్లి రమణమ్మ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

విశాలాంధ్ర - నర్సీపట్నం రూరల్ : పరిసరాల పరిశుభ్రంగా ఉంటే ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు ఆరోగ్యకరంగా ఉంటామని సర్పంచ్ నాగరత్నం సూరిబాబు పేర్కొన్నారు. మండల పరిధిలోని చెట్టుపల్లి గ్రామంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పంచాయతీరాజ్, ఉపాధి హామీ పథకం ఉద్యోగుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి సర్పంచ్ నాగరత్నం సూరిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు స్వర్ణాంధ్ర స్వఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నారని ఇందులో భాగంగా గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం, పశువుల ఆసుపత్రి ప్రాంగణం, రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటడం జరిగిందన్నారు. గ్రామంలో ప్లాస్టిక్ నిషేధిస్తూ స్వఛ్ గ్రామంగా తీర్చిదిద్దాలని తీర్మానం చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య అధికారిణి పద్మ, పంచాయతీ సెక్రెటరీ ఫణి,వైస్ ఎంపీపీ రత్నం రమణ, ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు ఊడి చక్రవర్తి, కో-ఆపరేటివ్ డైరెక్టర్ కలిమి సత్తిబాబు, మండల ప్రధాన కార్యదర్శి కరణం సంతోష్, మాజీ సర్పంచ్ అగ్రహారపు రమణ, పట్నాల రాజు, రెల్లి హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఎర్రం శెట్టి పాపారావు, ఉపాధి హామీ పథకం విఆర్పి షేక్ జిలాని, సేనాపతి రమణ పంచాయతీ పెద్దలు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించండి

స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్

విశాలాంధ్ర - నక్కపల్లి : స్వచ్ఛంద్ర కార్యక్రమాలను సక్రమంగా నిర్మించాలని స్వఛ్ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమిరెడ్డి పట్టాభిరామ్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయం పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. స్వచ్ఛంద్ర కార్యక్రమాల్లో భాగంగా సక్రమంగా నిర్వహించాలని గ్రామాల్లో పారిశుధ్యం పై అధికారులు ప్రత్యేక ద ృష్టి పెట్టాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వచ్ఛంద్రపై ద ృష్టిపెట్టారని అన్నారు. విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ ని సందర్శించారు. ఎస్ బి ఎం తరఫున పరికరాలు ట్రాక్టర్లు ట్రై సైకిళ్ళు త్వరలో సప్లై చేయబడతాయని అన్నారు. అనంతరం ఎంపీడీవో బి.చైతన్య ఆధ్వర్యంలో స్వఛ్ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏవో సీతారామరాజు పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతోనే ఆరోగ్యం, ఆనందం



విశాలాంధ్ర - చోడవరం : అంతర్జాతీయ ధ్యాన దినోత్సవ శుభాకాంక్షలు తో ధ్యానం అంటే ఏమిటి, ఎప్పుడు చేయాలి, ఎవరు చేయాలి, ఎంత సమయం చేయాలి, ఏ ఆసనంలో చేయాలి అనే అంశాలపై చోడవరం పతంజలి యోగశిక్షణా కేంద్రం గురువు పుల్లేటి సతీష్ శనివారం మీడియాకు కొన్ని విషయాలు తెలియజేశారు. ధ్యానం అంటే మాటల్లో మౌనం,... మనసులో శూన్యం, అంటే మాట్లాడకుండా మౌనంగా ఉండడం మనసులో ఏ ఆలోచన లేకుండా ఉండడం. ధ్యానం ఏ సమయంలో చేయాలి ధ్యానం బ్రహ్మ కాలంలో, అనగా తెల్లవారుజామున సూర్యోదయం ముందు ప్రారంభించాలని... స్థిర, సుఖాసనంలో చేయాలని, కిందన గాని, క్రిందిన కూర్చలేని వాళ కుర్చీలో గాని లేదా సోఫాలో గాని కూర్చొని నడుము మెడ నిటారుగా ఉంచి ధ్యానం చేయవచ్చును అన్నారు. పద్మాసనం, అర్థ పద్మాసనం, సిద్దాసనం లో కూడా చేయవచ్చును అని, 8 సంవత్సరాల పిల్లల్ని నుండి 80 సంవత్సరాల పెద్దవాళ్ల వరకు స్త్రీ, పురుషులు చేయవచ్చును అని తెలిపారు. 10 నిమిషాల నుండి 1 గంట వరకు చేయవచ్చును అని, రోజులో రెండు లేక మూడు సార్లు చేయ వచ్చునని తెలిపారు. విద్యార్థులు ప్రతిరోజు ధ్యానం చేయడంతో, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, ఆత్మవిశ్వాసం, పట్టుదల, మంచి ఆలోచన విధానం పెరుగుతాయిని, స్త్రీలు పురుషులు ప్రతిరోజు ధ్యానం చేయడం ద్వారా రక్తపోటు. డయాబెటిస్, గుండె నొప్పి. పక్షవాతం, తలనొప్పి. నిద్రలేమి, కోపం, భయం ఆందోళన, అసూయ, అశాంతి వంటి శారీరక మానసిక రుగ్మతలను తగ్గించుకొని, ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసం, సహనం, ఓర్పు పెంచుకొని జీవించనంతకాలం శారీరకంగా మానసికంగా ఆరోగ్యంగా ఆనందంగా జీవించ వచ్చునని తెలియజేశారు.